

ప్రతిభ చూపిన సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పరిశోధన అవార్డు ల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. కలశాలలోని అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధనలలో రాణిస్తున్నారని, ప్రతిభ కనపరిచిన వారికి నగదు బహుమతులు అందించినట్లు తెలిపారు. ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాతి పొందిన వెబ్ ఆఫ్ సైన్స్, స్కోపస్, ఎస్‌సిఐ, ఐఇఇఇ మొదలైన వాటిలో అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధన పత్రాలను ప్రచురించడం జరిగిందని, అన్నారు. వారిని మరింత ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సిబ్బందికి నగదు బహుమతిని ఇస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- పరీక్షలు రాయనున్న 22,355 మంది విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా 121 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - రాయచోటి

పదో తరగతి పరీక్షల సోమవారం ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అధికారులు సర్వం సిద్ధం చేశారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 505 ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలున్నాయి. ఎయిడెడ్ 5, ఎపిఎంఎస్ 17, ఎపిఆర్ఎస్ 8, ఎఎస్‌హెచ్ఆర్ఎం 1, బిసి వెల్ఫేర్ 4, ప్రభుత్వ తొమిది కెజిబివి 22, ఎంపిఎల్ 7, ప్రయివేట్ వేట్ 198, స్కూల్ వెల్ఫేర్ 11, ట్రైబల్ వెల్ఫేర్ 8, జడ్‌పి 214 పాఠశాలలు ఉన్నాయి. పదో తరగతి పరీక్షలు ఉదయం 9:30 నుంచి 12:45 నిమిషాల వరకు జరుగుతాయి. మార్చి 17న మొదటి లాంగ్వేజ్ పేపర్-1, 19న రెండువ లాంగ్వేజ్, 21న ఇంగ్లీష్, 24న గణితం , 26న ఫిజికల్ సైన్స్, 28న బయాలజీ, 29న వృత్తి విద్యా, ఏప్రిల్ 1 సాంఘిక శాస్త్రంతో పరీక్షలు ముగుస్తాయి.

జిల్లావ్యాప్తంగా 22,355 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 22,466, ఫెయిల్ అయిన విద్యార్థులు 834 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు. జిల్లా వ్యాప్తంగా 121 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఎ కేటగిరి 55, బి కేటగిరి 50, సి కేటగిరి 16 సెంటర్లు ఏర్పాటు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు 121, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 121, ఫ్లయింగ్ స్క్వాడ్ 11, సిట్టింగ్ స్క్వాడ్ 25, ఇన్విజిలేటర్లు 1250 మందిని ఏర్పాటు చేశారు. పరీక్ష జరిగే సమయంలో ఉదయం, మధ్యాహ్నం ఆర్‌టిసి బస్సును సౌకర్యాలు కల్పిస్తున్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధితాధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రతి సెంటర్‌లో ఎఎన్ఎం అందుబాటులో ఉంటారు. అలాగే తాగనీరు, మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేశారు. జిరాక్స్ సెంటర్లను కూడా వేస్తారు.

పట్టిష్టంగా నిర్వహిస్తాం



పరీక్షలను జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. మొబైల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రానికి తీసుకురాకూడదు. విద్యార్థులు టీవీలు, సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలి. విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సెంటర్లోకి విద్యార్థులు 30 నిమిషాలు ముందుగానే హాజరు కావాలి. విద్యార్థులకు ప్రతి సెంటర్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్ష రాసి అన్నమయ్య జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపడానికి అందరూ



సహకరించాలి. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులు నెంబర్ కు 9100040686 సంప్రదించాలి.

-సుబ్రమణ్యం,జిల్లా విద్యాశాఖాధికారి, అన్నమయ్య జిల్లా.

పకడ్బందీగా నిర్వహించాలి
- పరీక్షల రాష్ట్ర పరిశీలకులు మధుసూదన్‌రావు



జిల్లాలో పదవ తరగతి పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఎస్ఎస్‌సి పరీక్షల రాష్ట్ర పరిశీలకులు డి. మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. ఆదివారం డిఇఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పరీక్షల సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జిల్లాలో మార్చి 17 నుంచి ప్రారంభమవుతున్న పదవ తరగతి పరీక్షలను విద్యాశాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. 121 పరీక్షా కేంద్రాలలో మొత్తం 22,355 మంది విద్యార్థులు హాజరు అవుతారని చెప్పారు. .విద్యార్థులు, ఇన్విజిలేటర్లు ఎవరూ కూడా ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదన్నారు. అధికారుకు సమాచారం ఇచ్చేందుకు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ వద్ద మాత్రమే సెల్ ఫోన్ ఉండాలన్నారు. 11 బృందాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌లుగా నియమించామన్నారు. 8 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. చూసి రాతలకు ఆస్కారం లేకుండా పరీక్షలను నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, ఫ్యాన్లు లైట్లు తదితర మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి కంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్ రెడ్డి, ఓపెన్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి-రాయచోటి

తెలుగుదేశం పార్టీ కార్యకర్త రామకృష్ణ హత్య నిందితులను వదిలే ప్రసక్తే లేదని తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, వారి కుటుంబానికి అండగా ఉంటామని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. ఆదివారం కొత్తపేటలోని రాజు ఒలంపియాడ్ స్కూల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ టిడిపి కార్యకర్త రామకృష్ణను వైసిపి నాయకులు అత్యంత దారుణంగా హత్య చేశారని అన్నారు. హత్య చేసిన వారు,చేయించిన వారు, వారి వెనుక ఉన్నవారు ఎంత పెద్ద వారైనా కఠిన శిక్ష తప్పదని అన్నారు. భవిష్యత్తులో ఎవరు కూడా ఇలాంటి ఘటనలకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయ కక్షాలతోనే ఈ హత్య జరిగిందని తాము అభివృద్ధి కోరుకుంటే ప్రతిపక్ష పార్టీ నాయకులు కార్యకర్తలు హత్యలు కోరుకుంటున్నారని ఇలాంటి పార్టీ నాయకులు సిగ్గుపడాలని తెలిపారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్ హుస్సేన్, వీరబల్లి మండల అధ్యక్షులు భానుగోపాల్ రాజు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** రామకృష్ణ మృతదేహానికి మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పుంగనూరు టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి నివాళులు అర్పించారు. హత్యకు దారి తీసిన విషయాలను కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. ఘటనా స్థలంలో పర్యటించిన పలమనేరు డిఎస్‌పిని హత్య చేసి లొంగిపోయిన వైసిపి కార్యకర్త వెంకటరమణకు సహకరించిన వారి వివరాలను కేసు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రామకృష్ణ కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఘటనపై సీరియస్ గా ఉన్నారని, హత్యకు దారి తీసిన పరిస్థితులు సహకరించిన అందరిపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంటు అధికారి ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, చిన్న మహేష్, జెసిబి వేణు, మల్లికార్జున నాయుడు, జివి నాయుడు, ఎస్.ఆర్ షంషీర్, రఘుపతి నాయుడు, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళకు బాసటగా ధాత్రి ఫౌండేషన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని బికెపల్లికి చెందిన శ్రావణికి ధాత్రి ఫౌండేషన్ బాసటగా నిలిచింది. మాజీ ఆర్మీ శామ్ కోటేశ్వర్ చేతుల మీదుగా వీల్ చైర్‌ను అందించారు. శ్రావణి నడవలేని పరిస్థితుల్లో సోదరుడి సాయంతో ధాత్రీ ఫౌండేషన్ ను ఆశ్రయించగా వీల్‌ఛైర్ అందించారు. చదువుకొని ఖాళీగా ఉంటున్న ఆ విద్యార్థినికి ఉపాధి నిమిత్తం అక్షరధాత్రి స్టడీ సెంటరును పెట్టించి పేద పిల్లలకు ఉచితంగా పాఠాలు చెప్పే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఫౌండేషన్ ద్వారా తనకు గౌరవ వేతనం కూడా అందజేస్తామని అధ్యక్షులు డాక్టర్ స్వాతి చక్రపాణి తెలిపారు. ఆపదలో ఉన్న వారికి ధాత్రి ఫౌండేషన్ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ధాత్రి కో-ఆర్డినేటర్ శివాడి గోవింద్, ఆశాజ్యోతి సభ్యులు రమేష్, మాజీ ఆర్మీ శామ్ కోటేశ్వర్ పాల్గొన్నారు.


శ్రావణికి వీల్ ఛైర్‌ను అందిస్తున్న డాక్టర్ స్వాతి

జిఎస్‌టి ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైన పీలేరు యువకుడు

ప్రజాశక్తి-పీలేరు

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సిజిఎల్-2024 పరీక్షలో పీలేరు యువకుడు తన ప్రతిభ చాటి జిఎస్‌టి ఇన్స్‌పెక్టర్‌గా ఎంపికయ్యాడు. పీలేరు ఇందిరా నగర్‌కు చెందిన జొన్నగడ్డల చలపతిరాజు, అన్నపూర్ణల కుమారుడు జొన్న గడ్డలబాలు వికాస్ సిజిఎల్ పోటీ పరీక్షలో సాధారణ కేటగిరిలో ఆల్ ఇండియా ర్యాంక్ 1173 ను సాధించి సెంట్రల్ రెవెన్యూ శాఖలో ఇన్స్‌పెక్టర్ ఆఫ్ జిఎస్‌టి అండ్ సెంట్రల్ ఎక్సైజ్ కు ఎంపికయ్యాడు. జొన్నగడ్డల బాలు వికాస్ తన అసామాన్య పట్టుదల, అంకితభావం, కృషితో కంబైండ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షలో తన సత్తా చాటాడు. ఈ యువకుడి తల్లిదండ్రులిరువురూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులుగా పనిచేశారు.తండ్రి కొద్దిరోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందినప్పటికీ ఆ బాధను గుండెలోని దాచుకుని, లక్ష్యసాధన కోసం దృష్టి సాధించాడు.తాను ఏ శిక్షణ కేంద్రానికీ శిక్షణ కోసంవెళ్లకుండానే, సొంతంగా చదివి అద్భుత విజయాన్ని అందుకున్నాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది : డిఆర్ఒ


రాయచోటి : పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డిఆర్ఒ

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో డిఆర్ఒ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమర జీవి పొట్టి శ్రీరాములు ఒక గొప్ప త్యాగ మూర్తి, భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాటం చేసిన ఆద్యుడని కొనియాడారు. 1901 మార్చి 16 న జన్మించి 1952 డిసెంబరు 15న అమరులయ్యారన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషుడని, ఆయన త్యాగ ఫలితమే, కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం 1953 అక్టోబర్ 1 న ఏర్పడిందన్నారు. అనంతరం, తెలంగాణ ప్రాంతంలో తెలుగు మాట్లాడే జిల్లాలను కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందన్నారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ తదితర ఆశయాల కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడని అన్నారు. .ఇటువంటి మహనీయుల జీవితం నుండి స్ఫూర్తి పొంది యువత సన్మార్గంలో, దేశ భక్తితో మెలగాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రెడ్డప్ప రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు:** నందలూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వారు చేసిన సేవలు స్మరించుకుని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లయన్ మన్నెం రామ మోహన్ మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం, తెలుగువారి కంటూ ఒక రాష్ట్రం ఉండాలని అప్పటివరకు మద రాసిలుగా పిలవబడుతున్న మనలను ప్రత్యేకంగా గుర్తింపు కావాలని పోరాడి ప్రాణ త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో లయన్ మన్యం రామ్మోహన్, లయన్ కుర్రామణియాదవ్, నందలూరు ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ యంబు లూరు నరసిం హస్వామి, గెలివి మల్లికార్జునశెట్టి, మేడా వెంకట కుమార్ శెట్టి, ఉప్పు శెట్టి సుధీర్, మోడపోతుల రాము, జంగం శెట్టి హరికృష్ణ, గంధం గంగాధర్, గురు ప్రసాద్, గుండు సురేష్, సునీల్ రెడ్డి పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగధ నుడని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి దేవతా సతీష్, ట్రెజరర్ సూరే గిరిధర్, ఉపాధ్యక్షులు జయం ప్రవీణ్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి, పొట్టి శ్రీరాములు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు.తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు 52 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణ త్యాగానికి పాల్పడిన త్యాగశీలి అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, వాసవి క్లబ్ అధ్యక్షుడు పొనగంటి అమరనాథ్ పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, ఆర్యవైశ్య సంఘం సభ్యులు

శబ్ద కాలుష్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



పరీక్షలు నిర్వహిస్తున్న స్పీచ్ థెరఫిస్ట్ బాబురావు

వినికిడి సమస్యలు రాకుండా ఉండాలంటే శబ్ద కాలుష్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ స్పీచ్ థెరఫిస్ట్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం దీప్ లాడ్జి ఎదురుగా గల రత్న స్పీచ్ అండ్ హియరింగ్ కేంద్రంలో ఆది సొసైటీ ఫర్ అప్లిఫ్టెమెంట్ ఆఫ్ రూరల్ ఎకానమీ ఎఎస్‌యుఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వినికిడి పరీక్ష శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు విపరీతమైన పెద్ద శబ్దాలను వినకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అత్యధిక శాతం చెవిలో హెడ్ ఫోన్స్ ఉపయోగించడం వల్ల కూడా ఇటీవల వినికిడి సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండడం, సరైన పౌష్టికాహారం తీసుకోవడం, తేలికపాటి వ్యాయామాలు, క్రమం తప్పకుండా నిద్రపోవడం వంటి వాటితో వినికిడి సమస్యలను అధిగమించవచ్చని ఆయన వివరించారు. రత్న స్పీచ్ అండ్ హియరింగ్ కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వినికిడి పరీక్షా శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 100 మందికి పైగా వినికిడి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. నిరుపేదలైన 18 మందికి ఉచితంగా వినికిడి యంత్రాలను అందించినట్లు తెలిపారు. తమ కేంద్రంలో ప్రతిరోజూ అనుభవజ్ఞులైన స్పీచ్, హియరింగ్ థెరఫిస్టులు అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పీచ్ థెరపిస్టు బాబురావు, సైకాలజిస్ట్ ప్రవళిక పాల్గొన్నారు.


బికెపల్లి ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

బికెపల్లిలో ప్రభుత్వ భూమి కబ్జా
- నిర్మాణం మొదలు పెట్టిన కబ్జాదారుడు
- తొలగిస్తామంటున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ భూమి అయితే కబ్జా చేసేద్దాం అంటూ మదనపల్లెలో కబ్జారాయుళ్లు వరుస పెట్టి, పోటీ పడి మరీ ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారు. ఆదివారం బికెపల్లిలో నరసింహులు అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేసి, ఆదివారం కావడంతో గుట్టు చప్పుడు కాకుండా నిర్మాణాలు మొదలు పెట్టేశాడు. ఆదివారం కావడంతో అధికారులెవ్వరూ అందుబాటులో ఉద్దేశంతో నిర్మాణం చేపట్టాడు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన విఆర్ఒ అందుబాటులో లేకుండా పోయారు. విఆర్ఒకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా అవుట్ ఆఫ్ కాలింగ్ ఏరియా అని వచ్చింది. అనంతరం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, తహశీల్దారు ధనంజయులకు విషయం చెప్పి వివరణ కోరగా తమ అధికారులను అక్కడికి పంపి విచారణ చేయిస్తామని తెలిపారు. తరువాత ఆర్ఐ భరత్‌ను విచారించి చర్యలు తీసుకోమని ఆదేశాలిచ్చారు. ఆర్ఐ కూడా తనకు పని ఒత్తిడి ఎక్కువగా ఉందని, ఈ రోజు వెళ్లలేనని, సోమవారం వెళ్లి విచారిస్తానని చెప్పారు. సోమవారం అధికారులు ఏ మేరకు స్పందించి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం
- డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్

ప్రజాశక్తి-రాయచోటి

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లి మార్గంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాజుల భాస్కర్ మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసిలకు బలమైన అభ్యర్థులను నిలబెట్టాలని ఆయన సూచించారు. జిల్లాలోని వివిధ మండలాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిలను నియమించి వారికి నియామక పత్రాలను అందించారు. రాజంపేట రూరల్‌కు మహాదేవయ్య, రాజంపేట టౌన్‌కు ఆదిల్, టీ. సుండుపల్లె మండలానికి సల్మాన్, ఒంటిమిట్ట మండలానికి సుబ్బరాయుడు, చిట్వేల్ మండలానికి చల్లా శ్రీనివాస్, పుల్లంపేట మండలానికి రమేష్, పెనగలూరు మండలానికి జీవరత్నం, ఓబులవారిపల్లి మండలానికి హరికృష్ణరెడ్డి, రాయచోటిటౌన్‌కు బాబాసర్దార్, లక్కిరెడ్డిపల్లి మండలానికి నాగార్జున, రామాపురం మండలానికి గణేష్, సంబేపల్లి మండలానికి సుబ్బయ్య, చిన్నమండెం మండలానికి ఆఫ్ ఖాన్ షబ్బీర్ ఖాన్, గుర్రంకొండ మండలానికి ఫైరోజ్, వాయల్పాడు మండలానికి సాంబశివ, పీలేరు మండలానికి శ్రీకాంత్, రామసముద్రం మండలానికి చిన్న రెడ్డి వారి సతీష్ రెడ్డి, నిమ్మనపల్లి మండలానికి శేఖర్, చౌడేపల్లి మండలానికి నందకుమార్ యాదవ్, పులిచెర్ల మండలానికి రియాజ్, పుంగనూరు మండలానికి మురళి యాదవ్, పుంగనూరుటౌన్‌కు ఆయుబ్‌బాషా, రొంపిచర్ల మండలానికి ముని రాజా, సదుం మండలానికి కదిరెప్పను నియమించినట్లు భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లాబకాష్, పుంగనూరు ఇన్‌ఛార్జి మురళి యాదవ్, పీలేరు ఇన్‌ఛార్జి సోమశేఖర్ రెడ్డి, రైల్వే కోడూరు ఇంఛార్జి గోశాల దేవి, పార్టీ సీనియర్ నాయకులు సింగం రామకృష్ణారెడ్డి, రాయచోటి చెన్న కృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గాజుల భాస్కర్

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఐసిడిఎస్ పీడీ రమాదేవి

ముఖా ముఖి..



ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందుబాటులో ఉండి వారు పౌష్టికాహారంతో ఆరోగ్యం కాపాడుకోవచ్చని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారతాధికారి రమాదేవి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఐసిడిఎస్ కార్యాలయాల పనితీరు, అంగన్వాడీ కేంద్రాలలో చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఎలా అందించాలో, బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు గురించి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖీలో అయన వివరించారు.

ఐసిడిఎస్ కార్యాలయాల వివరాలు తెలపండి?

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారిక అధికారి కార్యాలయం జిల్లా కేంద్రం రాయచోటిలో ఉంది. జిల్లాలో 11 ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాలున్నాయి. బి. కొత్తకోట, చిట్వేల్, లక్కిరెడ్డిపల్లి, మదనపల్లి, పీలేరు, రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, టి.సుండుపల్లి, తంబల్లపల్లి, వాల్మీకిపురం ప్రాంతాలలో ఉన్నాయి.

అంగన్వాడీ కేంద్రాల పని తీరు గురించి తెలియజేయండి?

ఐసిడిఎస్ కార్యాలయాల పరిధిలో పనిచేసే అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తాయి. అంగన్వాడీ కేంద్రాల్లో ఉదయం 3 నుంచి 6 సంవత్సరముల పిల్లలకు అల్పాహారంగా ఉడికించిన కోడి గుడ్డు ఇస్తాం. మధ్యాహ్నం వరకు పిల్లలకు ప్రీస్కూలు యాక్టివిటీస్ చేయిస్తాం. మధ్యాహ్నం పైన 100 మిల్లీలీటర్ల పాలు ఇచ్చి ఆట, పాటలు నేర్పిస్తాం.

జిల్లాలో అంగన్వాడీల్లో గర్భిణులు, బాలింతల వివరాలు చెప్పండి?

జిల్లా వ్యాప్తంగా మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలు 1828, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 405, సహాయకురాళ్లు 1780, 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 5,4023, మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 4,1764, గర్భిణులు, బాలింతలు 18407 మంది ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఖాళీల వివరాలు తెలపండి?

జిల్లాలో మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలు 30, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 14, సహాయకురాళ్లు 99, (కోర్ట్ కేసు లు, ప్రమోషన్లు, షిఫ్టింగ్ తో సహా కలిపి) ఖాళీలు ఉన్నాయి. అందులో 11 అంగనవాడీ కార్యకర్తలు, 12 మినీ అంగన్వాడీ కార్యకర్తలు, 93 అంగన్వాడీ సహాయకరాళ్ల పోస్టులు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. ఇంటర్వ్యూలు కూడా పూర్తయ్యాయి.

పౌష్టికాహారం వివరాలు తెలపండి?

ప్రతినెలా గర్భిణులకు, బాలింతలకు 3కేజీల బియ్యం, 1 కేజీ కందిపప్పు, 500గ్రాముల ఆయిల్, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు, 2కేజీల రాగిపిండి,1 కేజీ అటుకులు, 250గ్రాముల వేరుశనగ చిక్కీ, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల ఎండు ఖర్జూరం రెండు విడతలుగా ఇంటికి టి.హెచ్.ఆర్ ఇవ్వడం జరుగుతుంది.7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు 2.5 కేజీల బాలామృతం, 25 కోడిగుడ్లు, 2.5లీటర్ల పాలు రెండు విడతలుగా ఇంటికి టి.హెచ్.ఆర్ ఇస్తున్నాం.3 సంవత్సరముల నుంచి 6 సంవత్సరముల పిల్లలకు రోజూ అంగన్వాడీ కేంద్రానికి ఒకపూట సంపూర్ణ భోజనం ప్రభుత్వం వారు నిర్దేశించిన మెనూ ప్రకారం పెడుతారని పేర్కొన్నారు. రోజూ 1 ఉడికించిన కోడి గుడ్డు 100మిల్లీ లీటర్ల పాలు ఇస్తున్నాం.

జిల్లాలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లాలో 2 సిడిపిఒ, 1 ఎసిడిపిఒ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 24 గ్రేడ్-1, గ్రేడ్-2 సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.1 సీనియర్ సహాయకులు, 1 జూనియర్ సహాయకుల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

ఐసిడిఎస్ సొంత, అద్దె భవనాలు ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలు 2,275 ఉన్నాయి. సొంత భవనాలు 1,015, అద్దె భవనాలు 8,22, అద్దె లేని భవనాలు 438,(స్కూలు క్లాస్ రూములలో) ఉన్నాయి.

జిల్లాలో శిథిలావస్థకు చేరుకున్న ఐసిడిసి భవనాల పరిస్థితి ఏంటి?

జిల్లాలో శిథిలావస్థలో ఉన్న భవనాలు ఆరు ఉన్నాయి. వాటి మరమ్మతుల కోసం ఉన్నత అధికారులకు ప్రతిపాదనలను పంపాం.

బాల్య వివాహాలు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

బాల్య వివాహాలను నివారించడానికి జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశాం. అంగన్వాడీ కార్యకర్త నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అందరం కలిసి గ్రామాలలో పాఠశాలలో బాలికల హాస్టల్లో పిల్లలకు తల్లిదండ్రులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం.

గర్భిణులు, బాలింతలకు, తల్లిదండ్రులకు సలహాలేమైనా ఇస్తారా?

గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ ద్వారా అందించే పౌష్టికాహారం వారు మాత్రమే తినాలి. అప్పుడే వారికి సరైన పౌష్టికాహారం అందుతుంది. వారికి అందుబాటులో ఉన్న ఆకుకూరలు బాగా తినాలి. హెల్త్ చెకప్ తరచుగా చేపించుకోవాలి. అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, మెడికల్ ఆఫీసర్లు సలహాలు, సూచనలు తప్పక పాటించాలి.



మైక్‌సెట్‌ను అందిస్తున్న మానవతా సభ్యులు

ఆలయానికి మైక్‌సెట్ వితరణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

అనంతపురం గంగమ్మ తల్లి దేవస్థానంలో మానవతా సేవాసంస్థ సభ్యులు దాతల సహకారంతో రూ.18వేలు విలువైన మైక్ అంప్లిఫైర్ ఆలయ అధికారి అధికారి శ్రీనివాసులుకు అందించారు. కార్యక్రమంలో మానవతా కేంద్ర కమిటీ సభ్యులు వై. ప్రసాద్ యాదవ్, లక్కిరెడ్డిపల్లి అధ్యక్షులు డాక్టర్ ఎండి షఫినాయక్, కన్వీనర్ ఎ.శివయ్య, కార్యదర్శి ఏ రామచంద్ర కోశాధికారి రవికుమార్, మానవతా జిల్లా కమిటీ సభ్యులు పక్కీరయ్య, వెంకీ, ఆలయ అధికారి శ్రీనివాసులు, ఆలయ పూజారి గంగరాజు పాల్గొన్నారు. ఆలయ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ జాతలో మానవతా సభ్యులు అందించిన సేవలు అభినందనీయమని అన్నారు. ఉచిత మజ్జిగ, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించారని అన్నారు. అనంతరం మానవతా సభ్యులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి-రామాపురం

కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేసే పార్టీ టిడిపినేనని రాయచోటి నియోజకవర్గం ఐ టిడిపి ఛాంపియన్ నాగభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట లో ఆదివారం బూత్ నెంబర్ 40, 41 పార్టీ సభ్యత్వం పొందిన600 మంది కార్యకర్తలకు సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే కార్యకర్తల సంక్షేమానికి నిధులు కేటాయించిన పార్టీ టిడిపినేనని అన్నారు. వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందితే ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించిందని అన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్ కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పెంచలరెడ్డి, రియాజ్‌బాషా, వలి, ఇషాక్, అబ్బు సయ్యద్, పీర్, ముజా హిదిన్, సిరాజ్,యాజాష్ పాల్గొన్నారు.

కలకడలో మూడు పరీక్ష కేంద్రాలు

ప్రజాశక్తి- కలకడ

పదవ తరగతిపరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఇఒ మునీంద్ర నాయక్ తెలిపారు. సోమవారం నుంచి జరగనున్న పదవ తరగతిపరీక్షలకు మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ మూడు కేంద్రాలలో పరీక్షల నిర్వహణకు కావలసిన సరంజామా ను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పరీక్ష కేంద్రంలో 201 మంది, మోడల్ పరీక్ష కేంద్రం నందు192, మంది కోన పరీక్ష కేంద్రంలో60 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని కలకడ తెలుగు, ఉర్దూ, ఉన్నత పాఠశాలలు, ఎర్రయ్యగారిపల్లి, ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, బాలికల గురుకుల పాఠశాల, పాపిరెడ్డి గారిపల్లి, విశ్వ జ్యోతి ఉన్నత పాఠశాలలకు చెందిన 453 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు కలకడ పరీక్ష కేంద్రంలో సిఎస్‌గా చమల్ రాయుడు, డిఒగా శివకుమార్, ఆదర్శ పాఠశాల పరీక్షా కేంద్రానికి సిఎస్‌గా రామాంజులు నాయక్, డిఒగా శంకర్ నాయక్, కోన కేంద్రానికి సిఎస్‌గా రాము, డిఒ గా సోమశేఖర్‌రెడ్డి కోన పరీక్ష కేంద్రానికి కస్టోడియన్ అధికారిగా లోకేష్‌రెడ్డి వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ నిర్వ హణలో ఆదర్శ పాఠశాలకు చెందిన ముగ్గురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యా యులు 10వ తరగతి పరీక్షల నిర్వహణకు హాజరు కావడం గమనార్హం.

ఘనంగా ఘట్టు వెంకటేశ్వరస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-రామసముద్రం



మండలంలోని చెంబకూరు గ్రామ సమీపంలో వెలసిన శ్రీ ఘట్టు వెంకటేశ్వరస్వామి తిరునాలలో భాగంగా ఆదివారం రథోత్సవం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్ర మానికి వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పోటా పోటీగా మహిళలు, పురుషులు, చిన్నా పెద్దా అనే తేడా లేకుండా రథం ఊరేగింపు కార్యక్ర మంలో ఉత్సాహం గా పాల్గొన్నారు. సోమ వారం దీపోత్సవం జరుగునున్నట్లు నిర్వాహ కులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కలికిరి

శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో సంజీవిని ఉమెన్ హెల్త్ కేర్ పేరిట మండలంలో సర్వైకల్ కేన్సర్ అవగాహన, రక్షణ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం శ్రీ పద్మావతి హెల్త్ సర్వీస్ సొసైటీ కలికిరి క్రాస్ రోడ్డు ఆవరణలో సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతిలోని ప్రముఖ మెడిగో ఆస్పత్రికి చెందిన గైనకాలజిస్టులు, వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. గైనకాలజిస్టుల పర్యవేక్షణలో పాల్గొన్న మహిళలందరికీ గర్భాశయ కేన్సర్‌పై అవగాహన కల్పించారు. 54 మంది మహిళలకు ఉచిత పాప్ స్మియర్ టెస్టులు చేశారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారందరికీ ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ డాక్టర్ పివి.బ్రహ్మారెడ్డి, ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి హెచ్‌ఎం, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి, డాక్టర్ జిలాని, డాక్టర్ షమీం, షబ్బీర్ భాషా పాల్గొన్నారు.

కాశినాయన ఆశ్రమానికి చట్టబద్ధత అనుమతులివ్వాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

రాయలసీమతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచిన కాశినాయన మండలంలోని జ్యోతి క్షేత్రానికి ప్రభుత్వం చట్టబద్ధమైన అనుమతులు జారీ చేసి, వెంటనే పునర్నిర్మాణం చేపట్టాలని కాశి నాయన ఆలయ ట్రస్ట్ సభ్యులు కోరారు. మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ నాగ నాధేశ్వరకోన వద్ద ఉన్న కాశినాయన ఆలయ కమిటీ సభ్యులు, రెడ్డి సంఘం ప్రతినిధులు ఆదివారం జ్యోతి పుణ్యక్షేత్రానికి వెళ్లి అక్కడ కట్టడాల కూల్చివేత ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతి క్షేత్రంలో అక్రమంగా కట్టడాలు నిర్మించారని అన్యాయంగా కూల్చడం ఎంతవరకు సబబని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అటవీ అనుమతులు త్వరగా జారీ చేసి కట్టడ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాశి నాయన ఆలయ కమిటీ సభ్యులు కుడుముల గంగిరెడ్డి, మిట్టా శ్రీరాముల రెడ్డి, గుమ్మ నాగిరెడ్డి, ఎరికలరెడ్డి, దుంపలగట్టు రెడ్యం సుబ్బారెడ్డి, బొర్రా సుబ్బారెడ్డి, చిలకల నాగేశ్వర్ రెడ్డి, రెడ్ల సంఘం ప్రతినిధులు కేవీ సుబ్బారెడ్డి, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక శిల్పారా మంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంత గానో ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సంద డిగా మారింది. డ్యాన్స్ మాస్టర్ కిషోర్, కిషోర్ డ్యాన్స్ అకాడమీ, కడప చిన్నా రులు నిర్వహించిన నృత్య కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులను ప్రేక్షకులు తమ కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమ ఏర్పాట్లను శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి సాగుపై రైతులకు శిక్షణ

- ప్రస్తుత వాతావరణంలో తేనె మంచుపురుగు ఆశించే అవకాశం
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ప్రస్తుత వాతవరణ పరిస్థితుల్లో మామిడిని తేనె మంచు పురుగు ఆశించే అవకాశం ఉందని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మామిడి సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనె మంచు పురుగు నివారణకు బుప్రోఫూజిన్ 20 శాతం అసిపేట్ 50 శాతం 1గ్రాము లేదా డైనోటోఫ్యూరాన్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చెయ్యాలని అన్నారు. బియంవి అనే మైక్రోబియల్ మందును ఎకరాకు 100 మిల్లీలు 500 లీటర్ల నీటిలో కలిపి డ్రిప్‌లో వదలాలని తెలిపారు. అలాగే ఇప్పుడు పిందెలు రాలుతున్నట్లు అనిపిస్తే ప్లానోఫిక్స్ అనే మందును 500 లీటర్ల నీటికి 100 మిల్లీలు కలిపి స్ప్రే చెయ్యాలని అన్నారు. తామర పురుగులు ఇప్పుడు ఆశించే అవకాశం ఉందని తెలిపారు. దీని నివారణకు పసుపు రంగు జిగురు అట్టలను చెట్టుకు ఒకటి చొప్పున కట్టాలని సూచించారు. కానుగ సోప్‌ను 7.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి స్ప్రే చెయ్యాలని తెలిపారు. అప్పటికి తామర పురుగుల ఉధృతి కొనసాగితే ఎమామెక్టిన్ బెంజోయేట్ 5శాతం ఎస్‌జి 0.3 గ్రాములు లీటర్ నీటికి కలిపి స్ప్రే చెయ్యాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సింతటిక్ పైరిత్రోయిడ్స్ మందులను మామిడిలో వాడకూడదన్నారు. మామిడి రైతులు అందరూ ఫ్రూట్ కవర్లు కట్టుకోవాలని తెలియజేశారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ ఉద్యాన శాఖ తరపున మామిడి కాయలకి ఉపయోగించే కవర్‌లు సబ్సిడీలో అందిస్తున్నామని అన్నారు. అవసరమైన రైతులు మీ దగ్గరలోని రైతు సేవ కేంద్రాలలో నమోదు చేసుకుని పొందవచ్చని చెప్పారు. ఒక్కొక్క కవర్ ధర రు.2.20లని, ఇందులో సబ్సిడీ రూ.1, రైతు భాగంగా రూ.1.20 చెల్లించి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ అధికారి పురుషోత్తం, ఎడిఎ రమణ రావు, ఉద్యాన శాఖ అధికారి సుకుమార్ రెడ్డి, డివిఎంసి మెంబెర్ బోదిషావలి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, మామిడి రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

గంగమ్మ జాతరకు తొలగని ఇక్కట్లు

- రెండు గ్రూపుల మధ్య కుదరని సయోధ్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



జిల్లాలో ప్రసిద్ధిగాంచిన బలిజపల్లి గంగమ్మ జాతర నిర్వహణకు గతేడాది మాదిరిగానే అనేక ఇక్కట్లు, ఆటంకాల మధ్య జాతర ఎప్పుడన్నది వీడని చిక్కుముడిగానే ఉంది. సాధారణంగా అమ్మవారి జాతర మూడు కుటుంబాల వారు కలిసి నిర్వహిస్తుంటారు. గంగమ్మకు సమర్పించే సాంఘ్యాల విషయంలో ఒక కుటుంబంలో ఏర్పడిన కొన్ని సమస్యల వల్ల గత ఏడాది జాతర ఆలస్యం అయింది. గుగ్గిళ్ళ వారి ఇరు కుటుం బాలను ఒక్కో కుటుంబం వారు ఒక్కోసారి ఏడాదిలో రెండు దఫాలుగా జాతర నిర్వహించుకునేందుకు అప్పట్లో పెద్దల సమక్షంలో పోలీసులు తీర్మానం చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల గత ఏడాది ఒక కుటుంబం వారే జాతర నిర్వహించారు. ఈ ఏడు కూడా జాతర నిర్వహణకు అనేక ఇక్కట్లు ఏర్పడ్డాయి. అమ్మవారి నిధి నుంచి జాతరకు ఖర్చు చేయాల్సి ఉండగా జాతర నిర్వహణకు సంబంధించిన ఓ కుటుంబం అమ్మవారి నిధులేవి లేవంటూ తాము ధర్మకర్తలమని చెప్పుకుంటూ చందాల రూపంలో వసూళ్లకు పాల్పడుతున్నారని, నిధులు లేవన్నది సత్య దూరమని, ఆలయానికి ధర్మకర్తల మండలి అంటూ ఏమీ లేదని ఓ వర్గం వారు ఆరోపిస్తున్నారు. జాతర నిర్వహణకు ఎవరైనా సహాయం చేయదలుచుకుంటే జాతర ముగిసిన మరుసటి రోజు జాతరకు సంబంధించిన మూడు కుటుంబాల సమక్షంలో సహాయం అందజే యవచ్చునని ఆ వర్గం వారు తెలుపుతున్నారు. జాతర నిర్వహణలోని మూడు కుటుంబాలలో రెండు వర్గాల వారు ఇదే మాట ప్రస్తావిస్తూ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్యలు పరిష్కారం అయ్యి జాతర ఎప్పుడు నిర్వహిస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

ధర్మకర్తల మండలి అంటూ ఏమీ లేదు

తాము ధర్మకర్తలమని చెప్పుకుంటూ ఓవర్గం వారు చందాలు వసూలు చేస్తున్నారు. విదేశాల్లో సైతం వసూళ్లకు పాల్పడుతున్నారు. కానీ గంగమ్మ ఆలయానికి సంబంధించి ఎటువంటి ధర్మకర్తల మండలి లేదు. బోనం కుటుంబం, గుగ్గిళ్ల కుటుంబం, సంజీవపురం కుటుంబం అనే ఈ మూడు కుటుంబాల వారు గ్రామస్థులతో కలిసి మాత్రమే ఆలయ నిర్వహణ చేస్తుంటారు. ఆ వర్గం వారు అమ్మవారి నిధులు లేవని చెప్పడం కూడా సత్యదూరం. ఎవరైనా జాతరకు సహాయం చేయదలు చుకుంటే జాతర ముగిసిన మరుసటి రోజు ఈ మూడు కుటుంబాల సమక్షంలోనే సహాయం చేయాలి. అప్పుడే నిదులు దుర్వినియోగం కాకుండా ఉంటాయి.



-బోనం రమణ

మూడు కుటుంబాల సమక్షంలోనే చందాలు తీసుకోవాలి

ఆలయానికి ధర్మకర్తలు లేరు కాబట్టి ఏ నిర్ణయం తీసుకున్నా మూడు కుటుంబాల సమక్షంలోనే తీసుకోవాలి. చందాలు కూడా అందరి సమక్షంలోనే తీసుకోవాలి. జాతర సజావుగా జరగడానికి అందరూ సహకరించాలి.



-సంజీవపురం రమణయ్య

సమావేశాలకు వెళ్లకపోతే రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

శాసనసభకు వెళ్లడం ఇష్టం లేకపోతే పులివెందుల శాసనసభ సభ్యత్వానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని రోడ్డు భవనాల శాఖ అతిథిగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని సమస్యలను, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో ఎమ్మెల్యే జగన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటాడని 60 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో ప్రజలు జగన్‌ను గెలిపించారని తెలిపారు. ఎన్నికల్లో 11 సీట్లు వచ్చాయని జనాలను గాలికి వదిలేయడం శోచనీయమన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో వేంపల్లె పట్టణంలో తాగునీటి సమస్య, రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులు ఆగిపోయాయని తెలిపారు. వీటిని జగన్‌రెడ్డి అసెంబ్లీలో చర్చిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించి నిధులు కేటాయిస్తారని అన్నారు. వేంపల్లె పంచాయతీ ఇఒ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వేంపల్లె పంచాయతీలో పనిచేసిన కార్యదర్శులు బాధ్యతారహితంగా వ్యవహరించారని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి సమీప బంధువు రవి శంకర్‌రెడ్డి రూ.52 లక్షలు ఎత్తుకెళ్లిన మాట వాస్తవం కాదా అని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. తాజాగా సస్పెండ్ అయిన ఇఒ సుబ్బరెడ్డి రూ.1కోటి 88 లక్షలు మింగేశాడని ఆరోపించారు. ఏడాదిగా గ్రామ పంచాయతీ సమావేశం నిర్వహించకుండా వ్యవస్థను నాశనం చేశారని తెలిపారు. మూడు గ్రామ పంచాయతీ సమావేశాలకు హాజరుకకపోతే సర్పంచ్, వార్డు సభ్యుల సభ్యత్వం రద్దు అవ్వాలని, కానీ వేంపల్లె ఇందుకు విరుద్ధంగా జరుగుతోందన్నారు. సర్పంచ్ రాజీనామా చేయకుండా కనీసం ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇన్‌ఛార్జిగా శ్రీనివాసులు కొనసాగడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. రెండు రోజుల్లో సమర్థవంతమైన పంచాయతీ కార్యదర్శిని నియమించి ప్రజలకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రతి వీధికి తాగునీటిని అందిస్తామని తెలిపారు. సమావేశంలో డివి సుబ్బారెడ్డి, మాజీ ఎంపిటిసి జివి రమణ, జయచంద్రారెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, పోతిరెడ్డి శివ, కావలి భాను కిరణ్, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

వసతి గృహం చుట్టూ పందుల స్వైరవిహారం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గహం చుట్టూ పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వసతి గృహ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో పందులు హల్‌చల్ చేస్తున్నాయి. హాస్టల్ ప్రహరీ పక్కలోనే పందులు ఉంటున్నాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పక్కనే ఉన్న బాలుర ఉన్నత పాఠశాలలో ప్రవేశించి ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. విద్యార్థులు భోజనం చేసే సమయంలో వంటశాల, భోజనశాల, విద్యార్థుల చుట్టూ తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందులు గుంపులుగా వచ్చి తోసుకుంటు మీదకి వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పందుల బెడదను తప్పించి పిల్లలు వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెండింగ్‌లో ఉన్న గృహాలకు అదనపు లబ్ధి

- ఎంపిడిఒ రామాంజనేయరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వివిధ దశల్లో గృహ నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్న బిసి, ఎస్సి, ఎస్టీ లబ్ధిదారులు అదనంగా లబ్ధి పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ ఎం.రామాంజనేయ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో మండలానికి సంబంధించి బిసి 185 మంది, ఎస్సి 78 మంది, ఎస్టి 16 మంది గృహ లబ్ధిదారులున్నారని, వీరికి ప్రభుత్వం అదనంగా రూ.50వేలు మంజూరు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వ్యక్తిగత మరుగుదొడ్డి లేనట్లయితే కొత్తగా నిర్మించుకొనుటకు ప్రభుత్వం రూ.12వేలు మంజూరు చేస్తుందన్నారు. దరఖాస్తు చేయదలచినవారు మండల హౌసింగ్ ఎఇని సంప్రదించాలని సూచించారు.

స్టైఫండ్ పెంచే వరకూ దీక్ష విరమించేదిలేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తమకు స్టయిఫండ్ పెంచాలని 42 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న పశు వైద్య కళాశాల జూనియర్ డాక్టర్లతో ఆదివారం ఎపి విసి ఛైర్మన్ డాక్టర్ లక్ష్మయ్య, సంస్కృతి స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడారు. దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పశువైద్య విద్యార్థులకు ఇస్తున్న స్టయిఫండ్‌ను ప్రభుత్వం పెంచే ఆలోచనలో ఉందన్నారు. ధర్నా విషయంలో మీకు న్యాయం జరిగేలా ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. దీక్ష విరమించి క్లాసులకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఇందుకు విద్యార్థులు స్పందిస్తూ తమకు న్యాయం జరిగే వరకు దీక్ష విరమించేదే లేదన్నారు.

కూలీలకు వరం 'ఉపాధి'

ప్రజాశక్తి - ఖాజీపేట

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూలీలకు వరంగా మారింది. స్థానికంగానే ప్రజలకు పని కల్పించాలన్న లక్ష్యంతోపాటు కూలీల వలసలను నివారించాలన్న ధ్యేయంతో ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 రోజుల చొప్పున ప్రభుత్వం పని కల్పిస్తోంది. ఒక్కో కూలీకి సగటున రోజుకు సంసరి రూ.300 లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వేసవికాలం కావడంతో వ్యవసాయ పనులు ముగియడంతో గ్రామీణ ప్రాంత ప్రజానీకం ఉపాధి హామీ పనుల వైపు మొగ్గుచూపుతున్నారు. మండల వ్యాప్తంగా 6,487 కుటుంబాలు ఉపాధి చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికి పని కల్పిస్తున్నా.. పని చేసే ప్రాంతంలో కనీస సదుపాయాలు అందు బాటులో ఉండడం లేదని కూలీలు పేర్కొంటున్నారు. పని జరిగే ప్రాంతాల్లో కనీస సదుపాయాలు అందుబాటులో ఉంటే మరింత మందికి ప్రయోజనం చేకూరుతుందని కూలీలు అంటున్నారు. ఉపాధి హామీ ద్వారా పని లభించాలంటే కొత్తగా జాబ్ కార్డులు మంజూరు చేయాలని మరికొందరు కూలీలు పని కోసం కోరుతున్నారు.

ఎఎస్‌డబ్ల్యుఒ గురు ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ఎఎస్‌డబ్ల్యుఓ గురుప్రసాద్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేయాలని డివై ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆది వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులు క్రితం జమ్మల మడుగు ఎస్‌సి కాలేజీ హాస్టల్‌లో డిగ్రీ విద్యార్థిని ఆత్మ హత్య చేసుకుందని, ఇందులో సంబంధిత హాస్టల్ వార్డెన్, పర్యవేక్షణాధికారిగా గురుప్రసాద్ నిర్లక్ష్యం స్పష్టంగా కనబడు తోందన్నారు. గతంలో ఇక్కడ ఎఎస్‌డబ్ల్యుఒ కార్యాలయం ఉండేదని, అధికారి నిత్య పర్యవేక్షణ జరిగేదన్నారు. ఇక్కడున్న కార్యాలయాన్ని ప్రొద్దుటూరులో ఏర్పాటు చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఎప్పుడు వస్తారో.. రారో తెలియని పరిస్థితి అన్నారు. గతంలో ఎస్‌సి కాలేజీ హాస్టల్‌లో ఇద్దరు అమ్మాయిలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. అప్పుడే ఆయన వార్డెన్ ప్రభావతిపై చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేదికాదన్నారు. ఆయనపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్



వెంకటరమణ (ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యా యుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం పుంగనూరు మండలం పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, ఎన్‌విఆర్ లేఅవుట్‌లో నివాసముంటున్న వెంకటరమణ(55) చీకలబైలు ప్రభుత్వ పాఠశా లలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. ఆదివారం బోయకొండ గ్రామంలో బంధువుల గృహప్రవేశ కార్యక్రమానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గ మధ్యంలోని లక్ష్మీపురం సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రోడ్డు పైన పడిఉండడంతో వెనుకనే అదే కార్యక్రమానికి వెళ్తున్న వెంకట్రమణ భావమర్ది శంకర గమనించి వెంటనే 108 లో మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను మార్గమధ్యంలోనే చనిపోయినట్లు నిర్ధారించారు. సోమవారం నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా వెళ్లాల్సి ఉందని, ఇంతలోనే ఇంత ఘోరం జరిగి పోయిందని మృతుడి బావమర్ది బోరున విలపించాడు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద అకాల మరణం చెంద డం తో భార్యపిల్లలు ఆర్తనాదాలు ఆస్పత్రి వద్ద మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు : వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న నాగేశ్వర్

మదనపల్లె అర్బన్ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం గుర్రంకొండ మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. గుర్రంకొండ మండల పరిధిలోని చెరువు ముందరపల్లెకు చెందిన నాగేశ్వర్ ద్విచక్ర వాహనంలో గుర్రం కొండ నుంచి స్వగ్రామానికి బయలు దేరాడు. గుర్రంకొండ పట్టణ శివారులో రాయచోటి నుంచి మదనపల్లె వైపు వేగంగా వెళ్తున్న కారు నాగేశ్వర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు 108 లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు గుర్రంకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

89 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి- కలకడ

ఎలాంటి అనుమతులు లేకుండా 89 మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ కుమార్ తెలిపారు. మండలంలోని కోన పంచాయతీ కోనకు చెందిన ఎస్.ఖాదర్‌వలి వ్యక్తి తన ఇంటిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఉంచిన 89 మద్యం బాటిళ్లను కనుగొని వాటి స్వాధీనం నిందితుడిని హాజరపరిచినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బందిచే తనిఖీలు నిర్వహించగా ప్రభుత్వ మద్యం విక్రయిస్తున్నట్లు వికరిస్తున్నట్లు తేలిందని అన్నారు. పట్టుబడిన మందు బాటిళ్లలో 39 బీరు బాటిళ్లు, ఏడు బ్రీజర్లు, 50 వాటర్ బాటిళ్లు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

కట్టుకున్న భార్యపై కానిస్టేబుల్ కర్కశత్వం

- రెండో భార్యతో కలిసి దాడి
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



పోలీసు స్టేషన్‌లో బాధితురాలు ఆశాజ్యోతి

అతనో పోలీస్ కానిస్టే బుల్, ఎవరైనా సమస్యలపై స్టేషన్‌కు వెళితే న్యాయం చేసి పరిష్కరించాల్సిన బాధ్య తాయుత ఉద్యోగం చేస్తున్నాడు. సమా జాన్ని ప్రభావితం చేసే గురుతర బాధ్యత అతనిది. అయితే ఇవన్నీ మర్చిపోయి.. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా మూడు పెళ్లిళ్లు చేసుకున్నాడు. మొదటి భార్యను వదిలేసి, రెండో భార్య, మూడో భార్యతో వేరు కాపురాలు పెట్టి సంసారాన్ని కొనసాగి స్తున్నాడు. ఇప్పుడు మూడో భార్య, బిడ్డ బరువు కావడంతో వదిలించుకోవాలని చూస్తూ మూడో భార్యపై కర్కశత్వాన్ని ప్రదర్శించి చితకబాదాడు. బాధితురాలు ఆదివారం తన భర్త పనిచేస్తున్న పోలీసు స్టేషన్‌కే వెళ్లి తనగోడును వెళ్లబోసుకుని న్యాయం చేయాలని వేడుకుంది. ఈ సందర్భంగా బాధితురాలు ఆశాజ్యోతి మాట్లాడుతూ.. మదనపల్లె పట్టణం, బాలాజీనగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసులు కుమార్తె ఆశాజ్యోతి అయిన తాను ఓ కేసు విషయమై మూడేళ్ల క్రితం స్థానిక రెండో పట్టణ పోలీసుస్టేషన్‌కు వచ్చానని చెప్పింది. ఆ సమయంలో అక్కడే కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సురేష్ దగ్గరై మాయమాటలు చెప్పి ప్రేమపేరుతో లోబర్చుకుని రెండేళ్లపాటు సహ జీవనం చేశాడని పేర్కొంది. ఆ తరువాత గర్భవతి కావడంతో పెళ్లి చేసుకు న్నాడని తెలిపింది. అప్పటికే అతనికి రెండు పెళ్లిళ్లు అయినట్లు తెలియడంతో నిలదీయగా, మొదటి భార్యను వదిలేశానని, రెండో భార్య ఉమామహేశ్వరితో ఏ ఇబ్బంది లేదని, నిన్ను బాగా చూసుకుంటానని నమ్మబలికినట్లు చెప్పింది. రెండో భార్యతో స్థానిక గొల్లపల్లిలో నివాసం ఉంటూ, నన్ను శివాజీనగర్‌లో అద్దె ఇంట్లో కాపురం పెట్టాడని చెప్పింది. నాకు15 నెలల పాప ఉందని, గత కొంతకాలంగా రెండో భార్య ఉమామహేశ్వరి వద్దనే ఎక్కువగా ఉంటూ నన్ను, నా కుమార్తె ను పట్టించుకోలేదని తెలిపింది. తన బిడ్డకు ఆరోగ్యం బాగలేకపోవడంతో ఆస్పత్రికి వెళ్ళాలని భర్తకు ఫోన్ చేయడంతో తాను ఊర్లో లేనని, విధుల రీత్యా బయటికి వెళ్లానని, వచ్చిన తర్వాత చూస్తాలే అంటూ ఫోన్ పెట్టేశాడని చెప్పింది. తాను గొల్లపల్లిలో ఉన్న రెండో భార్య ఉమామహేశ్వరి ఇంటికి వెళ్లి చూడగా అక్కడే ఉన్నాడని పేర్కొంది. ఊరిలో లేనని ఎందుకు అబద్ధం చెప్పావని నిలదీయంతో తనపై దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టాడని, ఆ వెంటనే ఉమామహేశ్వరి సైతం దాడి చేసి చితకబాదిందని తెలిపింది. వారి దాడి నుంచి తప్పించుకుని స్థానిక టూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అదే పోలీస్ స్టేషన్లో భర్త కూడా పనిచేస్తుండడంతో పోలీసులు ఉదయాన్నే రమ్మని చెప్పి ఇంటికి పంపించేశారని పేర్కొంది. తిరిగి ఆదివారం ఉదయం పోలీస్ స్టేషన్ వెల్లగా సిఐ సారు లేరు, తర్వాత రమ్మంటూ వెనక్కి పంపించాని విలపించింది. నాకు నా బిడ్డకు ప్రాణహాని ఉందని, తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

పొలం కంచె ధ్వంసం

ప్రజాశక్తి-కలికిరి

తమ పొలం కంచె ధ్వంసం చేశారని నాగరత్నమ్మ అనే మహిళ పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేశారు. నాగరత్నమ్మ తెలిపిన వివరాల మేరకు. .పట్టణంలోని కొత్తపేటకు చెందిన తమకు కొర్లకుంట గ్రామం బెస్తపల్లిలో సర్వే నెంబరు 488/ఎ1ఎలో నాలుగు ఎకరాలు డికెటి భూమి ఉందని తెలిపారు. గతంలో ఈ భూమిలో తహశీల్దార్, పోలీసుల ఆధ్వర్యంలో కంచె ఏర్పాటు చేసుకున్నాని తెలిపారు. శనివారం తాను భూమి దగ్గరకు వెళ్లి చూసేసరికి నా భూమిలో కంచెను పూర్తిగా మల్లారెడ్డి, అతని కుమారులు ధ్వంసం చేశారని ఆరోపించారు. తనకు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా భూమిలోకి రాకుండా భయభ్రాంతులతో గురి చేస్తున్నారని, నా భూమిలో బోరు మోటారు పైపులు కేబుల్ కూడా దొంగలించారని, వీరి నుంచి తనకు, మా కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.



ధ్వంసమైన పొలం కంచె